

# నేనెవరిదాన్ని?

సుగుణప్రియ

శూన్యములోకి చూస్తూ ఆలోచిస్తున్నాను. ఒకదాని వెనక ఒకటి ఆలోచనలు పరుగెత్తుతున్నాయి. నా ముఖం విచారపూరితమై వుంది. అద్దంలో చూసుకున్నాను. కళ్ళు ఎర్రబడ్డాయి. చెక్కిళ్ళపై కన్నీటిధారలు కనపడుతున్నాయి. నే నేడ్చినట్లు నాకు తెలియదు. ముంగురులు రేగి సాయంకాలపుసన్ననిగాలికి ఫాలభాగంపై ఎగురుతూ నాట్యం చేస్తున్నాయి. నుదుట బొట్టు చెదిరివుంది.

"రాధీ రాధీ!" అంటూ అప్పుడే హడావిడిగా వచ్చిన శ్రీవారు నా పరిస్థితి చూచి కంగారుపడి పోయారు. వారు రాగానే నేనూ సర్దుకున్నాను కాని లాభం లేకపోయింది. ఎంత జాగ్రత్తపడినా విచారంతో కూడిన ముఖం అప్పుడే ఏర్పడుతుంది అందులోను నా ముఖం చూచి వారు నా పరిస్థితి ఇట్టే చదువేయగలరు. నేను ఏ కొద్దిగా విచారముగా వున్నా బాధపడతారు. చిన్నపిల్లను బుజ్జగించినట్లు బుజ్జగిస్తారు. ఇప్పుడూ అంతే. మామూలు వేళ లందు వారి బుజ్జగింపుకు నవ్వు వచ్చేది ఇప్పుడు దుఃఖం ముంచుకవచ్చింది దుఃఖంలో వున్నపుడు స్నేహితులుగాని బంధువులుగాని ఓదార్చడం వలన మనలో దాగి వున్న దుఃఖం బయటకు వచ్చేస్తుంది. అలాగే వారు నన్ను ఓదార్చుతూంటె ఇంత మంచివారికి ద్రోహం చేస్తున్నానన్న బాధతోనో మరే కారణంతోనో నేను యేడ్చేశాను.

నా దుఃఖం చూచి వారు మరి హడలిపోయారు. వారి హృదయం విలవిల లాడింది. "నా పిచ్చి రాధీ! ఏం జరిగిందో చెప్పవేంటి. ఇదిగో నీ కొరకు మాంచి మల్లెపూవులు తెచ్చాను. చూడు నీ అందమైన మొహం ఎంత చిన్నబోయింది. కళ్ళు ముక్కు ఎర్రబడ్డాయి. ఇదిగో! రాధీ! నీవు యిలా వుంటే నా కెలాగో వుంది. పద పద తొందరగా టాయిలెట్ అవ్. ఈరోజు వంట గొడవ పెట్టుకోబాక. యే హోటల్కైన వెళ్ళి పిక్చర్కు పోదాంపద." వారే బాత్రూంలోకి తీసుకుపోయారు నన్ను.

ఇక ఆలస్యమైతే వారే నా ముఖానికి సబ్బు రాయడానికి తయారుగా వున్నారు. వెంటనే ముఖం కడిగాను. టవల్తో తుడిచారు. వారి ఊరడింపు మాటలతో మనస్సుకొద్దిగా తేలికపడ్డది. వారి హృదయంపై యేడిచానేమో వారి బట్టలన్ని నలిగి కన్నీళ్ళ మరకలయ్యాయి.

"ఏమండీ మీ బట్టలన్ని చెడిపోయ్యాయి".

"నా రాధకన్న నాకు ఎక్కువేముంది. బట్టలు చెడిపోతే చాకలి బాగుచేస్తాడు. కాని నీవు బాధ పడితే నేను సహించలేను. నా రాధ ఎప్పుడు నవ్వుతూ తుళ్ళుతూ నాకు కనబడాలి".

నా చర్యకు సిగ్గుపడుతూ వారి అనురాగానికి పులకరించిపోయాను.

అప్పుడెందుకో నాకు సినిమాకు వెళ్ళాలనిపించ లేదు. ఇద్దరము మా పూలతోటలోనే కూర్చున్నాం. సాయంకాలం. సన్నని గాలులు చల్లగావీస్తున్నాయి. వాటితోపాటే పుష్పాలు వెదజల్లే సువాసనలను మమ్మల్ని ఆఘ్రాణించమని తీసుకొస్తున్నాయి. నేను పచ్చని గడ్డిపై పడుకుని నిర్మలమైన ఆకాశాన్ని చూస్తున్నాను. నామొహం వారివడిలో వుంది.

వారు నా ముంగురులను సవరిస్తూ, "రాధా! నీకు ఒక విషయం చెప్పాలి. శేఖర్ అనే నా స్నేహితుడు మా ఆఫీసులో పనిచేస్తున్నాడు. క్రొత్తవాడు కావడంవలన వాడికి ఇక్కడే మనకాంపౌండులో కుడివైపుగా వున్న గదిఇచ్చాను. వాడువచ్చి రెండు రోజులైనా నీకు పరిచయం చేయలేక పోయాను. వాడు ఇప్పుడు ఆఫీసునుంచి వచ్చివుండవచ్చు పరిచయం చేస్తాను. పద"

వారు అలా అడగ్గానే "వద్దులెండి. ఇంట్లోకి వెళ్దాం పద" అంటు లేచాను. రాత్రి పడుకునే వేళ కూడ శేఖర్ గురించే ఆలోచనలు. శేఖర్ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా బాధకలుగుతుంది. భయంతో వణికి పోతున్నాను. ఒక్కపక్క శేఖర్ అంటే అభిమానంగా వుంది. మరో ప్రక్క మావారికి ద్రోహం చేస్తున్నానేమో అనిపిస్తుంది. నా పక్కలో పడుకున్నవారికేసి చూశాను. అమాయకంగా పసివాని వలె నిద్రపోతున్నారు. నిద్రలోకూడా ముఖం చిరునవ్వు పులుముకున్నట్లేవుంది. నేనంటే వారికి ఆరో

ప్రాణం. శేఖర్‌తో నాకున్న పరిచయం వీరికి తెలియదు.

శేఖర్ వీరికి ప్రాణస్నేహితులు కావడం నా దురదృష్టమనే చెప్పాలి. గతించిందంతా మరచి వీరితో కాపురం చేస్తున్నాను. నిజం తెలిసిన తరువాత వీరునన్ను ఎంతనీచంగా చిత్రించుకుంటారో. అమృతంవంటి వారి హృదయం. వారి హృదయంలో నా స్థానం దిగిపోతుంది. నన్నో కులటగా భావించుకుంటారు. వెన్నవంటి వారి హృదయం కఠినంగా మారిపోతుంది. ఇలా ఆలోచించుకునే సరికి భయంతో వణికిపోయాను. శరీరమంతా చమటలు పట్టాయి. భగవాన్! ఏమిటీ పరీక్ష. నా కాపురాన్ని చల్లగా కాపాడు తండ్రీ! మా అనురాగ దాంపత్యాన్ని విడిపోకుండ చూడు భగవాన్!

* * *

తెల్లవారింది. రోజూ మామూలుగా జరిగే పనులన్నీ జరిగాయి. వారు ఆఫీసుకు వెళ్ళడానికి రెడీ అవుతున్నారు. కావలసినవి చేతికిస్తూ నేనూ అక్కడే నిలబడ్డాను.

ఇంతలో —

మధు! రేయ్ మధు! అంటు శేఖర్ అక్కడికి వచ్చాడు. నన్ను చూచి ఘ్రాన్పడి అలానే గడపలోనే నిలిచాడు. అనుకోని ఈ సంఘటనకు నేనూ తడబడ్డాను గుండెలో దడ దడ మంది.

"ఆరేయ్ శేఖర్! కమిన్! కమిన్! అలా నిల్చొని పోయేవేం. ఇదిగో ఈమిడా నా శ్రీమతి. పేరు రాధాదేవి. చాలా సిగ్గు. మొదటె నిన్ను పరిచయం చేస్తానంటే వద్దంది. తరవాత నావంక తిరిగి "వీడె శేఖర్ నా ఫ్రెండ్" అంటు పరిచయం చేశాడు. యాంత్రికంగా నమస్కార ప్రతి నమస్కారాలుజరిగాయి. తరువాత నేను వెళ్ళిపోయాను.

"నేను ఈరోజు ఆఫీసుకు రాలేనురా" అన్నాడు శేఖర్.

"అదేంటి ఏం జరిగింది" అన్నారు వారు.

వంట్లో బాగాలేదురా మధ్వేట్ను"

"సరే! వంట్లో బాగలేకపోతే మన రంగనాధం డాక్టర్‌గారికి ఫోన్‌చెయ్యి" అని ఫోన్ నెంబరుచెప్పి వెళ్ళిపోయారు.

ప్రక్క గదిలో వున్న నాకు వారి మాటలు వినవడ్డాయి. నా మూలంగా కలిగిన షాక్‌చే శేఖర్ ఆఫీసుకు వెళ్ళడంలేదనుకున్నాను. శేఖర్ రూములో లేడు. లాక్ వేసి వుంది. ఇకనుంచి నా అదృష్ట మెలాగుందో.

సాయంత్రం వారు ఆఫీసు నుంచి రాగానే అడిగారు, శేఖర్ ఎక్కడా? అని. అప్పుడు కూడ రూమ్‌కు లాక్‌వేసి ఉంది. నాకు తెలీదన్నాను. మరునాడు ఆ తరువాత రోజుకూడా శేఖర్ కనబడలేదు. నా మనస్సు పరిపరివిధాల పరుగెత్తింది. శేఖర్ ఏదైనా ప్రమాదానికి గురికాలేదు కదా అనిపించింది. లేక స్వయంగా అతడే ఆత్మహత్యకు పాల్పడి వుండవచ్చు. ఇవన్నీ నా అనుమానాలే.

నాల్గోరోజు మధ్యాహ్నం వారు తెచ్చిన వార్త విని భయపడ్డాను. శేఖర్ లారి ప్రమాదానికి గురయ్యాడట. చాల గాయాలు అయ్యాయి. రక్తం చాల కోల్పోయాడు. హాస్పిటల్‌లో వున్నాడట. ఇదంతా నా మూలంగానే జరిగింది. పాపిష్టిదాన్ని!

హాస్పిటల్‌కు వెళ్ళి శేఖర్‌ను చూడాలనుకున్నాను. కాని అక్కడికి వెళ్ళినతరువాత శేఖర్‌తో ఎలా మాట్లాడగలను? వెళ్ళకపోతే రాధ రాలేదని శేఖర్ ఎంతగా బాధపడతాడో ఏమిటి చెయ్యడం? చివరికి ఎలాగైతేనేం మా వారితో హాస్పిటల్‌కెళ్ళాను. వెళ్ళేసరికి శేఖర్ నిద్రలో వున్నాడు. కట్లలోవున్న శేఖర్‌నుచూచి దుఃఖం ముంచుకవచ్చింది. అణచి వేసుకున్నాను. ఇక అక్కడ వుండలేక రిక్షాలో ఇంటికి వచ్చేశాను. వారు అక్కడే వున్నారు.

శేఖర్ నన్ను ప్రేమించినందుకు ఫలితం ఇదా! అణచివేసుకున్న దుఃఖం బయటకు వచ్చేసింది ప్రవాహంలా. భగవాన్ ఎందుకు నన్నిలా హింసిస్తున్నావ్. నన్ను, నన్ను ప్రేమించినవారిని కష్టాలపాలు చేస్తున్నావ్. చివరికి నన్ను కట్టుకున్న 'వారికి' కూడ వచ్చేట్టున్నాయి. నేను బాధపడడమేకాక నాతో సంబంధం కలిగివున్న వాసకూడాబాధపడుతున్నారు. ఈ దురదృష్టవంతురాలిని ఎందుకు పుట్టించావ్?

## సుభాషితం

తనలో ఉన్న యోగ్యతలను గుర్తింపలేదని ఉత్తములైనవారు బాధపడరు. ఇతరులలో ఉండే యోగ్యతలను తాము గుర్తించలేదేమోనని మట్టుకు అనుక్షణం అందోళన పడతారు.

— కన్‌ఫ్యూషియస్.

ఎందుకు ఇంతగా బాధకరమైన జీవితాన్ని అల్లేవు అంటు వెక్కివెక్కి ఏడ్చాను.

ఆ తరువాత కొన్ని రోజులకు శేఖర్ గాయాలు మానిపోయాయి. స్వస్థత చిక్కినతరువాత హాస్పిటల్‌వారు డిశ్చార్జ్ చేశారు. మామూలుగా ఆఫీసుకు వెళ్ళసాగాడు శేఖర్. ఒకరోజు మావారు నాతో "రాధీ! శేఖర్ రూం దుమ్ముకొట్టుకుని వుంది. ఇవ్వాళ మధ్యాహ్నం పనిమనిషితో ఊడ్పించి శుభ్రం చేయించు" అన్నారు. అలాగే చేయించాను. బుక్స్ దుమ్ముతో నిండివున్నాయి. దులిపి చక్కగా టేబిల్‌పై అమర్చాను. టేబిల్‌పై శేఖరు డైరీ తెరచివుంది. చివరిపేజీలో నాపేరు కన్పించింది చదివాను.

"రాధా నీవు ఇలా నా మిత్రుని భార్యగా కనిపించగలవని కలలోకూడ అనుకోలేదు. నిన్ను చూచిన నాటినుండి పిచ్చివానివలె రోడ్లపై తిరిగాను. అందుకు ఫలితం యాక్సిడెంట్. గాయాలు తగ్గిన తరువాత ఇక్కడ వుండక ఎక్కడికైన వెళ్దామనుకున్నాను. కాని ఎప్పుడూ నీవే నా కళ్ళముందు కదలాడెదానివి. నిన్ను చూడనిది బ్రతుకలేననుకున్నాను. నీవు లేక ఒంటరిగా ఇంతకుముందు ఎలా గడిపానో. రాధా! ఆరోజు నీవు హాస్పిటల్‌కు వచ్చావని మధు చెప్పాడు. ఆరోజే నా బాధను మరిచాను. మిగతా రోజులలొ గాయాలచే ఎప్పుడు బాధపడేవాడిని" ఇంతే వుంది.

ఆసక్తిగా మొదటినుంచి పేజిలన్నీ తిప్పాను. ప్రతిపేజిలో నాపేరు తప్పక కనిపించేది. రైలు ప్రమాదంలో శేఖర్ దూరంగా చాల దూరంగా కొట్టుకుని పోయాడు. ఆ ఉరకలువేసే ప్రవాహంలో ఎవరో పల్లెవారు రక్షించారు. ఆరోగ్యం కుదుట పడే వరకు కదలనివ్వలేదు. తిరిగి వచ్చేసరికి మా కుటుంబం వారం ఎవరము లేము. అతని తల్లిదండ్రులద్వార నా వివాహం సంగతి విని శేఖర్ చాలరోజులు మంచం పట్టాడు. ఇదీ జరిగిన సంగతి.

నా కళ్ల ధారాపాతంగా వర్షిస్తున్నాయి. శేఖర్ హృదయ విదారక సంఘటనలు చదివిన తరువాత, కన్నీళ్లు తుడుచుకుని అక్కడే వున్న శేఖర్ ఫొటోను చేతిలోకి తీసుకుని చూస్తూన్నాను. గుమ్మం వద్ద చప్పుడయింది. శేఖర్ నిల్చొని నా వంకే చూస్తూ కనిపించాడు. కిటికీలోగుండ బయటకు చూశాను. సాయంకాలమైంది నాకు తెలియకుండానే. శేఖర్‌వైపు చూశాను. శేఖర్ కళ్ళప్పగించి నావైపే చూస్తున్నాడు. ఏం మాట్లాడాలో ఇద్దరికీ తెలియలేదు. రెండునిమిషాలు ఎక్కడివాళ్ళం అక్కడే నిలబడ్డాం. ఆ తరువాత

"రాధీ!" అంటూ శేఖర్ చేతులు సాచాడు పిచ్చిగా.

అంతే! పరిసరాలు మరిచాను. నేను ఒకరి భార్యనని మరిచాను. వెళ్ళి శేఖర్ చేతుల్లో వాలిపోయాను. రెండు చేతుల్తో నన్ను చుట్టేస్తు "రాధీ! రాధీ!" అంటు దుఃఖంతో. అదురుతున్న నా పెదిమలను పదే పదే చుంబించాడు. నాకన్నీరు తుడుస్తున్నాడు. కాని మా ఇరువురి మధ్య ఒక్క మాటకూడ లేదు.

అంతలో గుమ్మం వద్ద అలికిడయ్యింది. "శేఖర్!" అంటూ వారు లోపలికి రాబోయారు. మా ఇరువురి పరిస్థితి చూచి ఖిన్నులై నిలచిపోయారు. మేము మా పరిస్థితి తెలుసుకున్నాం. నేను శేఖర్‌కు దూరంగా జరిగి తల వంచుకుని నిలుచున్నాను. శరీరం వణకిపోతూంది. నిలబడటానికికూడ శక్తి చాలడంలేదు. ఊగిపోతున్నాను. కళ్ళకు మసక చీకట్లు కమ్మాయి. అలానె క్రింద కూలిపోయాను.

తిరిగి స్పృహవచ్చేసరికి నేను మా పడకగదిలో వున్నాను. గదిలో చీకటి వ్యాపించి ఉంది. ఆ దృశ్యం జ్ఞాపకం వచ్చి నిలువున వణికిపోయాను. గదిలో లైట్ వెలిగింది.

"రాధా! ఇదిగో ఈ కాఫీ తీసుకో" అంటూ వచ్చారు వారు.

వారు రాగానే నా ముఖం తిప్పేసుకున్నాను. చేతులలో ముఖందాచుకుని వెక్కివెక్కి యేడ్చాను. వారు రెండు నిముషాలు మౌనంగా నిలబడి తరువాత కాఫీ టేబిల్‌పై పెట్టి వెళ్ళిన శబ్దం వచ్చింది. వారి మౌనానికి మరీ యేడ్చాను.

వారు మాత్రం మౌనంగా వుండక ఏంచేస్తారు.

ఊరడించుతారా! బుజ్జగిస్తారా! నా కన్నీరే తుడుస్తారా! ఇప్పటికి వీరె నయం. ఇంకొకరైతే రభస చేసి ఈపాటికి ఇంట్లోంచి వెళ్ళగొట్టేవారే.

అసలు శేఖరంటే నాలో ఏ మూలనో ఇప్పటికి ప్రేమ వుంది. అలాఅని మావారిని ప్రేమించడం మానలేదు. వారిని నా హృదయ పూర్వకంగా ప్రేమించాను. ఈ ఇద్దరిమధ్య నేను నలిగిపోతున్నాను.

భారతదేశంలో ప్రతిస్త్రీపాతివ్రత్యానికిప్రాధాన్యమిస్తుంది, కట్టుకున్నవాడే తన సర్వస్వమంటుంది. అతనితోనె తన జీవిత మనుకుంటుంది. తనకిష్టం లేనివారితో వివాహంజరిగినా అతనినే పతిదేవునిగా పూజిస్తుంది. కాని......

ఒకర్నే ప్రేమించడం అనేది సిద్ధాంతమా! ఇంకొకర్ని ప్రేమిస్తే అది కామం ఔతుందా. ఇద్దరిని సమానంగా హృదయ పూర్వకంగా ప్రేమించవచ్చుగా!

కాని మన పూర్వీకులు స్త్రీకి అంతగా స్వాతంత్ర్యం ఇవ్వలేదు. పురుషుడే అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. పురుషుడు ఎందరినైనా ప్రేమించవచ్చు. తన ధర్మపత్ని వుండగా రెండవ స్త్రీని ప్రేమించవచ్చు. వివాహం చేసుకోవచ్చు. చట్టం అడ్డం వస్తే మతం మార్చుకోవచ్చు. లేనిచో తాను ఇష్టపడ్డ స్త్రీని 'వుంచుకోవచ్చు'.

కాని స్త్రీ ఒక్కరినే ప్రేమించాలి. ఆ ఒక్కరు ఎవరో కాదు భర్త. ఇష్టం లేకున్న భర్తనే ప్రేమించాలి. చచ్చినట్టు అతని చెంతనే పడుండాలి. మరొకరి యందు మనసు కలిగితే ఆమె కులట. కర్మకాలక స్త్రీకి ఇరువురియందు ప్రేమకలిగితే, ఆ ఇరువురిలో ఎవరిని వివాహం చేసుకోవాలో తెలియక నలిగిపోతుంది,

అసలు ప్రేమ అనేది ఒకరిపైనే కలుగుతుందా ఇంకొకరిని ప్రేమించడం జరిగితే అది మోహమా ఇదేది నాకు అంతుపట్టకుండ వుంది.

శేఖర్ నాకు కనుపించి చిత్రవధ చేస్తున్నాడు నన్ను. వీరిరువురిలో నేను ఎవరిని తిరస్కరించాలి? యౌవనంలో అడుగిడుతూనే శేఖరును ప్రేమించాను. పెళ్ళిచేసుకున్నాను. దురదృష్టమో అదృష్టమో రైలు ప్రమాదంలో శేఖర్ చనిపోయాడనుకున్నాను, ఆయన జీవించిఉన్నట్టు అమాకీ లేదు. మా ఇద్దరికీ శారీరక సంబంధం ఏ మాత్రంలేదు. కొద్దికాలం తర్వాత మా తల్లిదండ్రులు మధుకిచ్చి వివాహం చేశారు. శేఖర్‌తో ఎడబాటుకలిగి వీరి స్వంతమయ్యాను. శేఖర్‌ను మరచి వారి ప్రేమలోని మాధుర్యాన్ని చవిచూస్తూ, వారిని నా సర్వస్వంగా ప్రేమించసాగాను. వీరిరువురిని నా మనసారా హృదయపూర్వకముగా ప్రేమించాను. మరి ఇప్పుడో...

అశక త్రెరలో పోకమాదిరి ఇద్దరి మధ్య నలిగిపోతున్నాను. ఇప్పుడు నేను ఎవరిదాన్ని, ఒక ఆస్తిలాగా నేను వీరిలో ఎవరికి చెందాలి?

★

# రత్నాలరాసులు

## ఆర్జించడం – అనుభవించడం

అదృష్టదేవత అమాంతం వరమిస్తే రెండు చేతులా ధనార్జన చేసి, అడుగు పెట్టుమీద నుండి ఆకాశం మీదకెక్కి, కన్నూ మిన్నూ కానకుండా బ్రతికేవాళ్ళను చూస్తే అందరికీ కన్ను కుడుతుంది. అనుకోకుండా వాడి నెత్తిమీదికి అపాయం వచ్చి, ఆకాశంనుండి వాడు దభేలున క్రిందపడితే తలొక మాట చిలవలు పలవలుగా చెప్పుకుంటారు. అది సహజమని, తిక్క కుదిరిందిలే, అంత అహంభావమా, ఎంతైనా అన్యాయార్జితమే గదా, అంత పొగరు పనికిరాదు అని వ్యాఖ్యానిస్తారు. అదేం విచిత్రమో, అన్యాయంగా ఆర్జించడంవరకే అదృష్టంగాని, అనుభవించడానికి అదృష్టముండదు. ఎవడో ఒకడొచ్చి అంతా ఎగరేసుకు పోవడమో, లేక ఆర్జించినవాడు అనుభవించకుండానే అకస్మాత్తుగా మరణిస్తే అతడి వారసులు దాన్ని అనుభవిస్తూ కూర్చోడమో సాధారణంగా జరిగే విషయం. ఏదేమైనా ఆ ఆర్జించినవాడికి ఎవరి దగ్గరనుండీ సానుభూతి లభించదు. నిందించేవారు నీతిమంతులుగాకపోయినా ఆ అదృష్టదేవత వారిని వరించలేదని కోపమో వాడినే ఎందుకు వరించాలనే ఈర్ష్య కారణమో ఇతమిద్ధంగా చెప్పలేం గాని, ఆ 'వాడి' కి మాత్రం చనిపోయాకగూడా దయచూపించ రెవరూ. వాళ్ళ సంగతలా ఉంచుదాం.

ఇంకోరకం దురదృష్టవంతులున్నారు. రెక్కల కష్టంమీద సంపాదిస్తారు, అదృష్టం నిచ్చెనను పడుతూ లేస్తూ ఎక్కుతారు. తోటి వారికింత పెడతారు, తామింత తింటారు. ధనార్జనతో పాటు మంచి పేరు సంపాదించుకుంటారు. కాని వాళ్ళుగూడా దాన్ని అనుభవించలేరు. అకస్మాత్తుగా చావడమో, బ్రతికుండాగానే మళ్ళీ దరిద్రులుగా మారడమో జరుగుతుంది. వీళ్ళకు నలుగురి దగ్గరనుండి సానుభూతి లభించేమాట వాస్తవమేగాని, అది తప్ప మొదటి వర్గం వారికీ వీరికీ అట్టే భేదం లేదు. ఇద్దరూ సంపాదించారు. ఇద్దరూ అనుభవించకుండానే పోయారు. అది అలా జరగడం సహజమంటాం. మరి రెండో వర్గం వాళ్ళ విషయమేమిటి? గనుక ఇందులో సహజం అసహజం అనే ప్రసక్తి లేదని తేలిపోతుంది. న్యాయా న్యాయాల ప్రశంస అసలే లేదు.

సరిగ్గా ఇక్కడే దేవుడు జ్ఞాపకం వస్తాడు. అందుకనే హోలీబైబిల్లో ఉన్న ఒక మహాజ్ఞాని మాటలు ఒప్పుకోకతప్పదు. "దేవుడు మానవుడికి నియమించిన ఆయుష్కాలమంతటిలో, అతడు తన కష్టార్జితంవల్ల సుఖంగా బ్రతకగలగడం మహాగొప్ప అదృష్టం. దేవుడు ఒకడికి ధనధాన్య సమృద్ధినిచ్చి, తన కష్టార్జితాన్ని అనుభవించే అదృష్టానిస్తే, ఆ భాగ్యం అపురూపమనుకోవాలి, దేవుడికి కృతజ్ఞతగా బ్రతకాలి. అలాంటి వాడిదే అసలైన హృదయానందం." కష్టపడి ఆర్జించటం వేరు, దాన్ని అనుభవించగలగడం వేరు. అదికేవలం భగవంతుడి దయ అని ఆ జ్ఞాని వ్యాఖ్యానం. అవునువేస్తం, ఆ దయ నీకు కావాలంటే యేసుక్రీస్తును నీ దైవంగా స్వీకరించి, ఆయనకు నీ పాపాలను నివేదించి పశ్చాత్తాపపడు. ఆయన నిన్ను తన బిడ్డగా అంగీకరిస్తాడు. అప్పుడుగాని నీ కష్టార్జితాన్ని నువ్వు అనుభవించే అదృష్టం కలగదు. ఆ నాడుగాని నీకు నిజమైన హృదయానందం అనుభవంలోకి రాదు.

రానున్న వారం మీ కోసం మరొక రత్నాలరాశి.

— ఎన్. జయకుమార్రావు, ఎం. ఎ.

ఉచితం ఉచితం ఉచితం

మీ ఇంట్లో కూర్చుని బైబుల్ పరిశోధనమీద చక్కటి సర్టిఫికేటు పొందాలన్నా, బైబుల్‌కి సంబంధించిన అందమైన, విలువగల పుస్తకాలు కావాలన్నా ఒక కార్డుమీద మీ అడ్రస్‌తో స్పష్టంగా వ్రాయండి. పోస్టు ఖర్చులుకూడా మావే.

ఇదీ అడ్రస్:
ఎస్. జాన్ డేవిడ్
నిరీక్షణ
పోస్టు బాక్సు : 12
చిలకలూరిపేట. గుంటూరు(జిల్లా)

27 th Gospel Message Inserted by
S. John David, Post Box No. 12, Chilakaluripet, Guntur Dt.